
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

గురువారం 25 జనవరి 2024




పొలిటికల్ హీట్

- తాడేపల్లి ప్యాలెస్‌కు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- హడావుడిగా సమావేశమైన ఎస్వీ అనుచరులు
- రెండు వర్గాలుగా చీలిన వైసీపీ
- కర్నూలు వైసీపీలో చెలరేగిన టికెట్ మంటలు
- ఐదో లిస్టులో కర్నూలు సమన్వయకర్త ఎవరో?

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వైసీపీలో టికెట్ మంటలు చెలరేగాయి. తాడేపల్లి ప్యాలెస్ పెద్దల పిలుపుతో విజయవాడకు సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పరుగు పెట్టారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలంటూ వైసీపీ నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతుల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో కర్నూలు నియోజకవర్గ వైసీపీ టికెట్ అంశం పొలిటికల్ హీట్‌ను పెంచుతోంది. వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోవడంతో ఎవరికివారే యమునాతీరే అన్నట్లు సమావేశాలు, ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎస్వీ కుటుంబానికి టికెట్ ఇవ్వాలంటూ ఆయన వర్గీయులు ఏకంగా వైసీపీ నాయకత్వానికి అల్టిమేటం జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇస్తే ఓటమి తప్పదంటూ వైసీపీకే చెందిన ముస్లిం నాయకులు, కౌన్సిలర్లు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో వైసీపీలో టికెట్ పోరు రోడ్డున పడినట్లయింది. అదే క్రమంలో టికెట్ ఆశతో వైసీపీలో చేరిన డీసీసీ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పీఆర్‌ఓ షేక్ పూల బషీర్ అహ్మద్ తదితరులు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.







● ఎస్వీ వర్గం అల్టిమేటం!

కర్నూలు వైసీపీ టికెట్ కోసం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఎస్వీ మోహన్ రెడ్డి లేదా ఆయన సతీమణి కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఇద్దరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలంటూ ఆయన వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. వైసీపీకి చెందిన ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, ఎస్సీ, బీసీ, ఎస్టీ నాయకులు సహా కార్పొరేటర్లు గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఓ హోటల్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం కొసమెరుపు. సమావేశంలో ముగ్గురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఎస్వీ కుటుంబాన్ని కాదని హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయం అంటూ పరోక్షంగా అధిష్టానానికి సంకేతాలు పంపారు. 2019 ఎన్నికల్లో ఆనాటి ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కష్టపడడం వల్లే వైసీపీ అభ్యర్థి హాఫీజ్‌ఖాన్ జిల్లాలోనే అత్యల్పంగా 5 వేల కంటే తక్కువ ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆనాడు ఎస్వీ కుటుంబం కష్టపడకపోయి ఉంటే హాఫీజ్‌ఖాన్ గెలిచేవారా..? అని ముస్లిం నాయకులే ఘాటుగా ప్రశ్నించడం కొసమెరుపు. సర్వేలు చేస్తారో.. రీ సర్వేలు చేపడతారో తమకు తెలియదని, ఎస్వీ కుటుంబానికే టికెట్ ఇవ్వాలంటూ వైసీపీలోని ఓ వర్గం అధిష్టానంపై ఒత్తిడి తెస్తోంది. వైసీపీ అధినాయకత్వం నుంచి పిలుపుతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ విజయవాడకు వెళ్లిన రోజే సీటు కోసం ఎస్వీ వర్గీయులు ప్రత్యేకంగా సమావేశమై రాజకీయంగా వేడి రాజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు షరీఫ్

● తాడేపల్లిలో హాఫీజ్ పైరవీలు

వైసీపీ ఎమ్మెల్యేలకు పార్టీ నాయకుడి నుంచి పిలుపు వచ్చిందంటే టికెట్ గోవిందా..! అనే చర్చ ఆ పార్టీలో ప్రధానంగా జరుగుతోంది. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌లకు వైసీపీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. వారు వెళ్లాక బుజ్జగించి పంపడమే కాకుండా ఆ నాలుగు నియోజకవర్గాల్లో కొత్తగా ఇన్‌చార్జిలు (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు)ను ప్రకటించారు. తాజాగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు పిలుపు రావడంతో విజయవాడకు చేరుకున్నారు. దీంతో వైసీపీ త్వరలో విడుదల చేయబోయే ఐదో లిస్టులో కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఉంటారన్నది స్పష్టమవుతోంది.

తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా వైసీపీ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎంవో ఆఫీస్ ధనుంజయరెడ్డిలు హాఫీజ్‌ఖాన్‌తో చర్చించినట్లు తెలిసింది. అయితే రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేమని బుజ్జగించారా..? ఆయనకే టికెట్ ఇచ్చేలా మాట్లాడారా..? అన్న సమాచారం బయటకు రాలేదు. ఈ తరుణంలో హడావుడిగా వైరివర్గం ఎస్వీ వర్గీయులు ముఖ్యంగా ముస్లిం మైనార్టీలు సమావేశమై హాఫీజ్‌ఖాన్‌కు కాకుండా ఎస్వీ దంపతుల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేయడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. అదే క్రమంలో కర్నూలు టికెట్ కోసం పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పీఆర్వో షేక్ పూల బషీర్ అహ్మద్ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ టికెట్ ఇప్పిస్తామని ఐప్యాక్ టీం జిల్లా ఇన్‌చార్జి ఒకరు బలమైన హామీ ఇవ్వడం వల్లే అహ్మద్ అలీఖాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరినట్లు తెలుస్తోంది. టికెట్ ఇవ్వకపోతే వైసీపీ మోసం చేసినట్లేనని అహ్మద్ వర్గీయులు మరోవైపు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు మైనార్టీ నాయకులు కూడా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వాహన చట్టాలపై అవగాహన కల్పించండి: డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 24: వాహన చట్టాలపై విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వాహన చట్టాలపై వాహనదారులకు అవగాహన కల్పించడం ద్వారా రహదారి ప్రమాదాలు తగ్గించే అవకాశం ఉందన్నారు. రహదారి భద్రతా సమావేశాల్లో తీసుకున్న తీర్మానాలను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జనవరి 20న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఫిబ్రవరి 19 వరకు జరుగుతాయని అన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.నాగభూషణం, ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి..!

- ఇన్‌చార్జి మార్పుపై పునరాలోచనలో వైసీపీ



ఎమ్మిగనూరు, జనవరి 24: ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. పార్టీ అధిష్టానం ఎమ్మెల్యేల మార్పులు.. చేర్పుల్లో భాగంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించిన మాచాని వెంకటేష్‌ను నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమించింది. అయితే మాచాని వెంకటేష్‌కు పార్టీ సర్వేల్లో అనుకూలత లేకపోవటం, ఎమ్మెల్యే తనయుడు జగన్మోహన్‌రెడ్డి, ముఖ్య అనుచరులు అసంతృప్తి వ్యక్త చేశారు. దీంతో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి ఎమ్మెల్యేతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యే ససేమిరా అన్నారు. అంతేగాక పార్టీ నాయకులతో మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి మాచాని వెంకటేష్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. అయినా సర్వేల్లో ఆశించిన స్థాయిలో అనుకూలత రాలేదని అధిష్టానం పునరాలోచనలో పడినట్లు సమాచారం. బుధవారం అధిష్టానం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తాడేపల్లికి పిలిపించటంతో ఆయన బయలుదేరి వెళ్లారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే ఎమ్మిగనూరు వైసీపీ ఇన్‌చార్జి మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. దీంతో ఆశావాహులైన వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్, మాజీ ఎంపీ బుట్టా రేణుకలకు వైసీపీ ఎమ్మెల్యే సీటుపై ఆశలు చిగురించాయన్న చర్చ కొనసాగుతోంది.

అధిష్టానం మేరకు పోటీ చేస్తా: కోట్ల

తుగ్గలి, జనవరి 24: ఎన్నికల్లో పోటీకి సంబంధించి మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి స్పందించారు. టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆయన వెల్లడించారు. బుధవారం తుగ్గలి మండలంలోని రాతన గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే జగన్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీ అధిష్టానం మేరకు ఎంపీ అయినా, ఎమ్మెల్యేగా అయినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రతి నియోజకవర్గంలో గెలుపొందేలా ముందస్తు ప్రణాళికల్లో భాగంగానే టికెట్లను కేటాయిస్తున్నారని కోట్ల చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు రైతు జిల్లా నాయకుడు మనోహర్‌చౌదరి, నాయకులు గోవిందరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి


ఆడపిల్లలను బతకనిద్దాం: కలెక్టర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: బాలికలను పుట్టనిద్దాం.. బతకనిద్దాం..చదవనిద్దాం..ఎదగనిద్దాం అనే భావనతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసారు. ఆరోగ్యశాఖ అధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లను బరువుగా, బానిసగా చూసే మనస్తత్వం నుంచి సమాజాన్ని బయటికి వచ్చే ప్రయత్నంలో భాగంగానే ఈ రోజు జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. పుట్టినప్పటి నుంచి చనిపోయే వరక ప్రతి రోజూ బాలికలు, మహిళలు పోరాటం చేయాల్సి వస్తోందని అన్నారు. ఆడపిల్లలకు చిన్నప్పటి నుంచి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లాంటివి నేర్పించాలన్నారు. అబ్బాయితో పాటు అమ్మాయిలు సమానంగా చదువుకుని ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడేలా కుటుంబం, సమాజం బాధ్యత తీసుకోవాలని అన్నారు. సీడబ్ల్యూఎస్ ఛైర్మన్ జుబేదాబేగం, వేధింపుల నిరోధక కమిటీ ఛైర్మన్ మాధవీ శ్యామల, దిశా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆడపిల్లల ఆవశ్యకత, సమాజంలో వారి చైతన్యం గురించి వివరించారు. అనంతరం నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అనే బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్, డెమో ప్రమీల పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

నేటి నుంచి నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలు



ఎమ్మిగనూరు, జనవరి 24: ఎమ్మిగనూరు పట్టణంలో వెలిసిన నీలకంఠేశ్వరుడి ఉత్సవాలు ఏటా పుష్యమాసంలో వైభవంగా నిర్వహిస్తారు. దాదాపు నెల రోజుల పాటు జరిగే జాతర సందడి గురువారం ప్రారంభమై ఈనెల 29వ తేదీ సోమవారంతో ముగుస్తాయి. పౌర్ణమిరోజు రాత్రి 9గంటల నుండి 12గంటల వరకు పుష్పరథారోహణ మహోత్సవం, పార్వతి పరమేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 26వ తేదీ శుక్రవారం రాత్రి 9గంటల నుంచి 12గంటల వరకు ప్రభావళి మహోత్సవం నిర్వహిస్తారు. 27వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు మహారథోత్సవం తేరుబజారులో అశేష భక్తజనం మధ్య నిర్వహిస్తారు. 28న రాత్రి 9గంటల నుంచి 12 గంటల వరకు స్వామి వారి వాహ్యావళి మహోత్సవం, 29న సాయంత్రం 5గంటల నుంచి 9గంటల వరకు తీర్థావళి వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగే మహేశ్వర బ్రాహ్మణ సన్మాన మహోత్సవం చేస్తారు.

- జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. రథోత్సవం జరిగే ప్రాంతమైన తేరు బజారులో గరుసు వేసి చదును పనులు నిర్వహించేందుకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టారు.
- ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు కొనసాగుతుండగా, అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు విక్రయించేందుకు వ్యాపారులు సామగ్రిని పట్టణానికి తరలిస్తున్నారు.



ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలి

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ● టీడీపీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

కర్నూలు(అర్బన్), జనవరి 24: చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి-నెల్లూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాయలసీమలోని కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, హిందూపురం, పరిధిలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులకు ఒక రోజు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పార్టీ నాయకులు చేరువకావాలన్నారు. సాంకేతిక అంశాలను రాజకీయాలకు జోడించి అన్ని విధాల నాయకులను తయారు చేయడం జరిగిందన్నారు. గ్రామ. బూత్ స్థాయిల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు జోన్ల వారీగా శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఓటర్ వెరిఫికేషన్, బాబు షూరిటీ..భవిష్యత్ గ్యారంటీ, కుటుంబ సాధికారత సారథుల నియామకం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఎం జగన్ జాబ్ కేలండర్ పేరుతో యువతను మోసం చేశాడన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి 120 మంది ఓటర్లకు ఒక గృహసారథి ఉంటారన్నారు. అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం చేపట్టబోయే పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు ఆకెపోగు ప్రభాకర్, అంబటి లక్ష్మీనారాయణ, సత్రం రామకృష్ణుడు, డి.జేమ్స్, ఎస్. ముంతాజ్, తిలక్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ సమీక్షలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

ఎంత కాలం ఈ వెట్టి చాకిరి?

- సమ్మె బాటలో సెర్ప్ ఉద్యోగులు
- 23 సంవత్సరాలుగా పర్మనెంట్ చేయాలని డిమాండ్
- హామీ అమలు చేయని సీఎంపై ఉద్యోగుల మండిపాటు
- ప్రభుత్వం దిగివచ్చే దాకా సమ్మె చేస్తామన్న సెర్ప్ నాయకులు



కర్నూలు(కలెక్టరేట్), జనవరి 24 : వివిధ ఉద్యోగ వర్గాలు రాష్ట్రంలో ప్రభుత్వం మీద తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నాయి. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి రోడ్ల మీదికి వచ్చి ఆందోళన చేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగులు ఇరవై మూడు సంవత్సరాలుగా తాము వెట్టి చాకిరీ చేస్తున్నామని, తమకు ఎప్పుడు విముక్తి అని ప్రశ్నిస్తూ సమ్మె బాట పట్టారు. బుధవారం రెండో రోజు వాల్మీకి సర్కిల్‌లో ఆందోళన చేశారు. తాను అధికారంలోకి వస్తే సెర్ప్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారు. ఆయన అధికారంలోకి నాలుగున్న సంవత్సరాలు దాటిపోతున్నా సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. అనేక సందర్భాల్లో ప్రభుత్వానికి విజ్ఞాపనలు ఇచ్చిన సెర్ప్ ఉద్యోగులు మంగళవారం సమ్మె ప్రారంభించారు. పేదరిక నిర్మూలనకు పాటు పడుతున్న సెర్ప్ ఉద్యోగులు పేదరికంలో మగ్గిపోతున్నారు. తమ ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలనే డిమాండ్ ఎండమావిగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణం పేదలకు సుస్థిర జీవనోపాధి వంటి సంక్షేమ పథకాలు సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పేదరిక నిర్మూలన సంస్థలో సీపీఎం 3, ఏపీఎం 50, సీసీ 107, ఏఏపీఏ 20 మంది పని చేస్తున్నారు. సెర్ప్‌లో అంతర్భాగమైన వైఎస్సార్ క్రాంతి పథకం కింద పొదుపు సంఘాలకు సేవలందిస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులైనప్పటికీ సీఎంఎఫ్ఎస్ ద్వారానే ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నారు. డీఆర్‌డీఏ శాఖలో అతి తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కారుణ్య నియామకాలు చేపట్టాలని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోడం లేదని విమర్శలున్నాయి. పెరుగుతున్న ధరల దృష్ట్యా అలెవెన్సులు పెంచాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.



నిరసన తెలియజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

నాలుగున్నర సంవత్సరాలుగా మోసం



తాను అధికారంలోకి రాగానే సెర్ప్ ఉద్యోగులందరినీ పర్మనెంటు చేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ హామీ ఊసే ఎత్తలేదు. దీంతో మాకు సమ్మెబాట తప్పలేదు.

- కృష్ణుడు, సెర్ప్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్

రెగ్యులర్ చేయాలి



సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి పే స్కేల్ అమలు చేసి క్రమబద్ధీకరణ చేయాలి. తక్కువ సర్వీసు ఉన్న ఇతర శాఖ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. 23 సంవత్సరాలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో మేం పని చేస్తున్నాం. ఒక శాఖను ఒకలాగా మరో శాఖను ఇంకోలాగా ప్రభుత్వం చూస్తున్నది. ఇది తగదు.

- శ్రీనివాసులు, సెర్ప్ ఉద్యోగుల గౌరవాధ్యక్షుడు

ఉపాధి హామీ కూలీలకు ముఖ హాజరు



కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 24: ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ముఖ హాజరును తప్పనిసరి చేసింది. ఉదయం, సాయంత్రం ఫొటో తీసి నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఫిబ్రవరి నుంచి అమలవుతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు ఇచ్చారు. వీరిలో కొందరు వలస వెళ్లిపోగా దాదాపు 80వేల నుంచి లక్ష మంది దాకా ప్రస్తుతం ఉపాధి పనులు చేస్తున్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, వారి అనుచరులు బోగస్ కూలీలను చేర్పించి ఈ పథకం నిధులను స్వాహా చేస్తున్నారు. సామాజిక తనిఖీలు చేస్తున్నా అక్రమాలను అరికట్టడంలో అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లోని తమ అనుచరులకు ఉపాధి కల్పించేందు కోసం ఈ పథకం బాగా ఉపయోగపడుతుందని వైసీపీ నాయకులు అనుకున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం ముఖ హాజరును తప్పనిసరి చేయడంతో నాయకులు ఇబ్బందిపడుతున్నారు.

ఇంకా ఉత్తర్వులు అందలేదు: అమర్నాథ్‌రెడ్డి, డ్వామా పీడీ: ఉపాధి హామీ పథకంలో ముఖ హాజరు గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంకా రాలేదు. అవి వచ్చాకే నిబంధనల అమలుకు చర్యలు తీసుకుం టాం.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 24: ఎన్‌ఐటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న అయాన్ డిజిటల్ కేంద్రంలో పరీక్ష జరిగింది. మొదటి రోజున బీఆర్క్, బ్యాచ్‌లర్ ఆఫ్ ప్లానింగ్ పేపర్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 6:30 గంటల వరకు కొనసాగింది. అభ్యర్థులు వారి తల్లిదండ్రులు, బంధువులు పరీక్షా కేంద్రాలకు నిర్ణయించిన సమయం కంటే రెండు గంటల ముందే చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం రద్దీగా కనిపించింది. పరీక్ష నిర్వాహకులు లాకర్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ చార్జెస్ అధికంగా వసూలు చేయడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరగడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 27, 28, 29, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో బీటెక్ కోర్సులకు ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి.

సర్వర్ డౌన్ : విద్యార్థుల టెన్షన్

జేఈఈ-మెయిన్స్ ఆన్‌లైన్‌లో బుధవారం జరిగిన పరీక్షలో సర్వర్ డౌన్ కావడంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. దాదాపు ఒక గంట సమయం వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. సర్వర్ డౌన్ కారణంగా కోల్పోయిన సమయాన్ని అదనంగా కేటాయించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

టీపీఎస్ హరీష్‌చౌదరి అహుడాకు బదిలీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్(టీపీఎస్) హరీష్ చౌదరిని అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా)కు బదిలీ చేశారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జే.విద్యులత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు ఫారిన్ సర్వీస్ కింద అహుడాలో విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యువ కెరటాలు 44,273



- తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకున్న యువతరం
- ఫలించిన స్వీప్ కార్యక్రమం
- గతేడాదితో పోలిస్తే పెరిగిన 18-19 ఏళ్ల ఓటర్లు 69.56 శాతం
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువతరం ఓటర్లుగా మారితే ఎన్నికలకు కొత్త రక్తం వస్తుంది. ఎదిగే తరం భాగస్వామ్యం వల్ల ప్రజా ప్రాతినిధ్యం నిర్ణయాత్మకంగా మారుతుంది. ప్రజాస్వామ్యం క్రియాశీలం అవుతుంది. అందుకే అర్హులైన యువతీ యువకులందరూ ఓటరుగా నమోదు కావాలి.. అనర్హులు ఏ ఒక్కరు జాబితాలో పేరు ఉండకూడదు. ఇది కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యం. ప్రధానంగా 18-19 ఏళ్ల యువత కాలేజీల్లో ఉంటారు. వీరు ఓటరు నమోదుపై ఆసక్తి చూపడం లేదు. దీంతో సీఈసీ ఇలాంటి యువతను గుర్తించి ఓటరుగా నమోదు చేసేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం' (స్వీప్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్పెషల్ సమ్మరి రివిజన్-2024లో భాగంగా ఎన్నికల అధికారులు విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఓటరు నమోదు చేయించారు. ఫలితంగా 44,273 మంది నూతనంగా ఓటరుగా నమోదు అయ్యారు. ఇది రాష్ట్రంలోనే ప్రథమ స్థానం. రాబోయే ఎన్నికల్లో ప్రథకంగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

● ఫలించిన 'స్వీప్' కార్యక్రమం

అర్హులైన 18-19 ఏళ్ల యువతను ఓటర్లగా నమోదు చేయాలనే లక్ష్యంగా 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం' (స్వీప్)కు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) శ్రీకారం చుట్టింది. అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేది వరకు ప్రతివారం ఎన్నికల అధికారులు వివిధ విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. అంతేకాదు.. అక్కడే బీఎల్‌ఓలు వారి నుంచి ఫారం-6తో పాటు అవసరమైన ధృవపత్రాలు స్వీకరించారు. ఓటరుగా నమోదు చేయించారు. స్వీప్ కార్యక్రమం ఫలితం ఇవ్వడంతో 44,273 మంది తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఓటు హక్కు పొందారు. రాబోయే ఎన్నికల్లో ప్రథకంగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గత ఏడాది జనవరి 5న విడుదల చేసిన ఎస్‌ఎస్‌ఆర్-2023 జబితా ప్రకారం 18-19 ఏళ్ల యువత 13,474 ఓటర్లుగా నమోదు అయితే.. సోమవారం విడుదల చేసిన ఎస్‌ఎస్‌ఆర్-2024 జాబితా ప్రకారం 44,273 మంది నూతనంగా ఓటు హక్కు పొందారు. గతేడాదితో పోలిస్తే 30,799 మంది నవ ఓటర్లు పెరిగారు. అంటే.. 69.56 శాతం పెరుగుదల నమోదు చేసుకోవడం కొసమెరుపు. అత్యధికంగా పాణ్యంలో 7,618 మంది.. అత్యల్పంగా ఆదోనిలో 4,815 ఓటర్లు నమోదు అయ్యారు. యువ ఓటర్ల నమోదులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది.

● గడువు ముగిసిన తరువాత కూడా..

అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9వ తేది వరకు 'స్పెషల్ సమ్మరి రివిజన్-2024' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయి నుంచి బూత్ లెవల్ స్థాయి వరకు అని దశల్లో ఎన్నికల అధికారులు ఈ కార్యక్రమంలో నిమగ్నం అయ్యారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అంతేకాదు.. నవంబరు 4,5, డిసెంబరు 2,3వ తేదిల్లో ప్రత్యేక ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. గడువు ముగిసినా డిసెంబరు 10 నుంచి జనవరి 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయడం కొసమెరుపు. ఈ సమయంలో ఓటు నమోదు కోసం ఫారం-6 దరఖాస్తులు 24,504 రాగా 15,212 పరిష్కరించగా 9,291 పెండింగ్‌లో ఉన్నాయి. ఓటు తొలగింపు కోసం ఫారం-7 దరఖాస్తులు 13,723 రాగా 9,938 పరిష్కరించారు. 3,785 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. ఫారం-8 దరఖాస్తులు 9,827 రాగా 6,439 పరిష్కరించగా 3,390 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెబ్‌సైట్ పునఃప్రారంభం అయిన తరువాత పరిష్కరిస్తామని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కర్నూలు(కలెక్టరేట్),జనవరి24: జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. అర్హత కలిగి ఓటర్లగా నమోదు కాని వారు సంబంధిత బీఎల్వో, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓ, ఓటరు హెల్ప్ లైన్ మొబైల్ యాప్ ద్వారా లేదా ఫారం 6 ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

నేడు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భార్గవతేజ తెలిపారు. సి. క్యాంపు, పాతబస్టాండ కొండారెడ్డి బురుజు, కేవీఆర్ కళాశాల మార్గాల నుంచి ర్యాలీ బయలుదేరి జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ముగుస్తుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువకులు ఈ ర్యాలీలో పాల్గొని జాతీయ ఓటరు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సుద్దముక్కతో ఓటు నమూనా



ప్యాపిలి, జనవరి 24: మండలంలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన చిత్రకారుడు మధుకృష్ణ సుద్దముక్కతో ఓటు నమూనాను బుధవారం తయారు చేశారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నమూనాను తయారు చేసినట్లు చిత్రకారుడు తెలిపారు. ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఓటరు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని మధుకృష్ణ ఓటర్లకు పిలుపునిచ్చాడు.

● నియోజకవర్గం వారిగా ఓటర్లుగా నమోదు అయిన 18-19 ఏళ్ల యువత

నియోజకవర్గం	2023	2024	పెరుగుదల
కర్నూలు	3,648	5,759	2,111
పాణ్యం	2,249	7,618	5,369
పత్తికొండ	1,398	5,009	3,611
కోడుమూరు (ఎస్సీ)	1,157	5,433	4,276
ఎమ్మిగనూరు	1,886	5,807	3,921
మంత్రాలయం	875	4,919	4,044
ఆదోని	922	4,815	3,893
ఆలూరు	1,339	4,913	3,574
మొత్తం	13,474	44,273	30,799

ఓటరు జాబితాను చూపారని వీఆర్‌ఏకు షోకాజ్ నోటీసు

మద్దికెర, జనవరి 24: కొత్త ఓటర్ల జాబితాను తెలుగుదేశం పార్టీ నాయకులకు చూపించారని వీఆర్‌ఏ ఆనంద్‌కు తహసీల్దార్ నాగభూషణం బుధవారం షోకాజ్ నోటీసు ఇచ్చారు. మద్దికెర గ్రామంలోని ఓటరు జాబితాను బూత్‌లెవల్ అధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌ఏ ఆనంద్ స్థానిక టీడీపీ నాయకులకు చూపించారని, టీడీపీ నాయకుల వెంట రెండు ఇళ్లకు వెళ్లారని స్థానిక వైసీపీ నాయకులు పత్తికొండ ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండా టీడీపీ నాయకులకు ఓటరు జాబితాను ఎలా చూపించారని వాగ్వాదానికి దిగారు. సంబంధిత వీఆర్‌ఏను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయనను ఉద్యోగం నుంచి తొలగించే వరకు వదిలే ప్రసక్తి లేదని ఒత్తిడి తెచ్చారు. దీంతో గత్యంతరం లేక రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏ ఆనంద్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగభూషణం మాట్లాడుతూ కొంతమంది ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసు ఇచ్చానని అన్నారు.

పెళ్లి వేడుకలో ఘర్షణ : యువకుడికి కత్తిపోట్లు

నంద్యాల క్రైం, జనవరి 24 : నంద్యాల నందమూరినగర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఓ వివాహ వేడుకలో ఘర్షణ జరిగింది. డీజే పాటలను మార్చే విషయంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోటుకు దారి తీసింది. పెళ్లిలో డీజే కార్యక్రమంలో యువకులు ఫుల్లుగా మద్యం తాగి డ్యాన్స్ చేశారు. ఇందులో భాగంగా పాటలను మార్చుతూ ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. షేక్ నూర్‌బాషాపై ప్రదీప్‌గౌడ్, సంతోష్ అనే యువకులు కత్తితో దాడిచేసి గాయపరిచారు. నూర్‌బాషాను నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నంద్యాల తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అనారోగ్యంతో గిరిజనుడు మృతి

● మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు డబ్బుల్లేక భార్య అవస్థలు



ఆత్మకూరు వైద్యశాల వద్ద భర్త మృత దేహం పక్కన రోధిస్తున్న భార్య అంకమ్మ

కొత్తపల్లి, జనవరి 24: చెంచు గూడేనికి చెందిన వ్యక్తి అనారోగ్యంతో ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసేందుకు కూడా డబ్బులు లేక భార్య ఇబ్బందిపడింది. ఆమె రోదన చూపరులను కంటతడి పెట్టించింది.. కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురం గిరిజన గూడేనికి చెందిన నిమ్మల బాలస్వామి (52) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం బాలస్వామికి ఉన్న ఫలంగా ఆయాసం, దగ్గు ఎక్కువ కావడంతో భార్య అంకమ్మ అతికష్టమీద భర్తను ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చింది. అక్కడి కోలుకోలేక బాలస్వామి మృతి చెందాడు. తన భర్త మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం ఇంటికి తీసుకెళ్లేందు కూడా ఆమె దగ్గర చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితి తెలుసుకున్న కొందరు ఎర్రమఠం ప్రభుత్వ వైద్యశాలకు చెందిన డా. జబీర్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే స్పందించి మృతదేహాన్ని పెద్ద గుమ్మడాపురం గూడేనికి తీసుకెళ్లేందుకు ఆటోను పంపించి కొంత ఆర్థిక సాయం అందించారు. మృతునికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నప్పటికీ ఎవరూ రాకపోవడంతో భర్త మృతదేహాన్ని భార్య అంకమ్మనే తీసుకెళ్లింది.

నంద్యాల జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా అనసూయ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 24: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో సీనియర్ హెడ్ నర్సులకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు మంగళవారం కడపలో రీజినల్ డైరెక్టర్ రత్నకుమారి హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలు జీజీహెచ్ సీటీవీఎస్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న జి.అనసూయ నంద్యాల జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతి కల్పించి పోస్టింగ్ వేశారు. అనంతపురానికి చెందిన సీనియర్ హెడ్ నర్సులు ఏ. పద్మావతి, బి. పద్మావతిలను ఆదోని జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-2లుగా పదోన్నతి కల్పించి ఆర్డీ పోస్టింగ్‌లు వేశారు. పదోన్నతులు పొందిన వారు ఈ నెల 31న విధుల్లో చేరాలని కడప ఆర్డీ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

ప్యాపిలి, జనవరి 24: మండలంలోని చిగురుమాను మిట్ట దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మద్దిలేటి(48) మృతి చెందారు. మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన మద్దిలేటి గొర్రెలను మేపుకొనేందుకు చిగురుమాను మిట్ట దగ్గరకు వెళ్లారు. తిరిగి గొర్రెలను తోలుకొని గార్లదిన్నెకు వస్తుండగా చిగురుమాను మిట్ట సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మద్దిలేటి అక్కడికక్కడే మృతి చెందారు. మద్దిలేటి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 24: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమ్యూనికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ జి.సృజన నోడల్ అధికా రులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ లో కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన అన్ని అంశాలను పర్యవేక్షిస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల సమాచార సేకరణకు వీలుగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా సమాచార పర్యవేక్షణకు వీలుగా టీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల వివరాల సమాచారాన్ని సేకరించాలని నోడల్ అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్ రావు, సీపీవో హిమ ప్రభాకర్ రాజ్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

పది రోజుల్లో పనులు పూర్తి చేయండి : కలెక్టర్ కార్యాలయంలో సునయన ఆడిటోరియం, ఏవో కార్యాలయ గదులు, అన్ని సెక్షన్ల గదులలో జరుగుతున్న మరమ్మతుల పనులను బుధవారం కలెక్టర్ జి.సృజన పర్యవేక్షించారు. రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌ను వెంటనే పనులు పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేష్, కలెక్టరేట్ ఏవో శ్రీనాథ్, కాంట్రాక్టరు ఉన్నారు.

ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు

● బీటీ నాయుడికి బయోడేటా అందజేసిన రాజశేఖర్



టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడికి బయోడేటా అందజేస్తున్న రాజశేఖర్

కర్నూలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని బరిలో దింపాలని ఆ పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. దీంతో బీసీల్లోని పలువురు తటస్తులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కురవ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ కంపెనీలో సీనియర్ ప్రాజెక్టు మేనేజరుగా పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఎంకే రాజశేఖర్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ నియోజవర్గం పరిధిలో నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కలసి తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడును కలసి బయోడేటాను అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును కూడా ఇప్పటికే కలిసి ఎంపీ టికెట్ కోసం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు రాజశేఖర్ వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా 20 ఏళ్ల అనుభవం ఉందని, నార్త్ అమెరికా, యూరప్ దేశాల్లో పర్యటించానని, ప్రజా సేవలో మమేకమయ్యేందుకు ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆయన తెలిపారు. బీసీలకు టీడీపీ ద్వారానే న్యాయం జరుగుతుందని రాజశేఖర్ పేర్కొన్నారు.

పెద్దపులి సంచారం



రుద్రవరం సమీపంలో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం, జనవరి 24: నల్లమల అటవీ తీరంలోని రుద్రవరం సమీపంలో తెలుగు గంగ ప్రధాన కాల్వ గట్టుపై పెద్దపులి బుధవారం ఉదయం సంచరించింది. పంట పొలాలకు వెళ్లిన రైతులు పాదముద్రలను గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు రేంజర్ శ్రీపతినాయుడు తన సిబ్బందితో వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. అడవి నుంచి పెద్దపులి బయటికి వచ్చి తిరిగి అడవిలోకి వెళ్లిపోయిందని, ఎలాంటి భయాందోళన వద్దని రేంజర్ సూచించారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసరు నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కౌతాళం, జనవరి 24: మండలంలోని వల్లూరు గ్రామం వద్ద తుంగభద్ర నది నుంచి కౌతాళం, కోసిగి మండలాలకు అక్రమ మద్యంను సరఫర చేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ద్విచక్రవాహనం, పడవ తెప్పను స్వాధీనం చేసుకున్నారు. కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోసిగి మండలం కడదొడ్డి గ్రామానికి చెందిన తోవి వినోద్ కుమార్, కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రాగప్ప ద్విచక్రవాహనంతో పాటు నదిలో తెప్పలో 16 బాక్సుల(1536) కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. 16బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు ద్విచక్రవాహనం, తెప్పను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సోమ్లనాయక్, కానిస్టేబుళ్లు వీరాంజనేయులు, మద్దిలేటి, వీరేష్, రామచంద్ర, నారాయణ ఉన్నారు.

వైసీపీ పాలన చీకటిమయం

- 29న ఉమ్మడి కర్నూలులో షర్మిల పర్యటన
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

ఆత్మకూరు, జనవరి 24: నాలుగున్నర ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చీకటిమయంగా మారిందని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ నియంత పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు కేవలం పదవులు కేటాయించి పెత్తనమంతా తమ వారి చేతుల్లోనే ఉంచుకుని సీఎం జగన్ బడుగులకు అన్యాయం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే 29న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలారెడ్డి కర్నూలుకు రానున్నారని తెలిపారు. ఈమె పర్యటనలో నంద్యాల, కర్నూలు జిల్లాల కాంగ్రెస్ ముఖ్యనేతలతో సమీక్షలు నిర్వహించి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. షర్మిల పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మానపాటి శ్రీనివాసగౌడ్, ఇబ్రహీం, ఇస్మాయిల్, హబీబ్ ఖాన్, సురేంద్రారెడ్డి, ఇస్మాయిల్, నూర్‌బాషా, జావీద్, శివశంకర్, అబ్దుల్ రహిమాన్ ఉన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 24: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జనరల్ సెక్రటరీ నవీన్ పాటిల్ మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి ఉద్యోగుల పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, నాయకులు తిమ్మన్న, నరసింహ, నాగరాజు, చంద్రపాల్, బాబు, మోహన్, రాముడు, షఫీ, మద్దిలేటి, నాగేశ్వరరావు, సోమన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

అభివృద్ధి లేని కోడుమూరు : టీడీపీ



పూడురులో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న దస్తగిరి

కర్నూలు(రూరల్), జనవరి 24: కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా అభివృద్ధి చేయలేదని టీడీపీ యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను బుధవారం కర్నూలు రూరల్ మండలం పూడురు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ పడిదెంపాడు నుంచి పూడూరు వరకు రహదారి అధ్వానంగా ఉన్న వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గ్రామానికి కనీసం అంబులెన్స్, స్కూల్ బస్సు కూడా రాలేని దయనీయ పరిస్థితి నెలకొన్నా ఎమ్మెల్యేకు ఏమాత్రం చీమకుట్టినట్లైనా లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బొగ్గుల దస్తగిరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూడురు మాజీ సర్పంచు మల్లికార్జున, బాలనాయుడు, రామకృష్ణ, టీడీపీ నాయకులు శంకర్‌నాయుడు ఎంపీటీసీ పవన్, చంద్ర, సురేష్‌బాబు, చంటి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి



డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఓర్వకల్లు, జనవరి 24: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎన్‌హెచ్-40 నేషనల్ హైవే ప్రాజెక్టు కడప టు కర్నూలు ప్రాజెక్టు హెడ్ మధుసూదన్ సూచించారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలోని టోల్‌ప్లాజాలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా డ్రైవర్లకు ఉచిత కంటి, షుగర్, బీపీ పరీక్షలను వైద్యులు నిర్వహించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, ఓవర్ టేకింగ్‌పై మధుసూదన్ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఓపెనియన్స్ హెడ్ అర్జున్‌రాజ్, ప్లాజా మేనేజర్ రవి రాజన్, రూట్ ఆఫీసర్ కటారుకొండ రంజిత్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఓర్వకల్లు, జనవరి 24: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా పాణ్యం నియోజకవర్గ కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా అయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగిన ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ రంగనాథగౌడు, సర్పంచ్ నాగేశ్వరమ్మ, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయంలోకి మురుగు నీరు..

చర్యలు తీసుకోవాలని మేయర్‌కు వినతి

కర్నూలు(కల్చరల్), జనవరి 24: నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయం పక్కన ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేయించి, ఆలయంలోకి మురికినీరు రాకుండా చర్యలు తీసుకోవాలని భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నగర మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం మేయర్‌ను అయన గృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం వస్తే కల్వర్టు నిండిపోయి, మురుగునీరు ఆలయంలోకి చేరుకుంటోందని, గతంలో స్థానిక కార్పొరేటర్‌కు, మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. సమస్య ఇలాగే కొనసాగితే వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. దీనికి మేయర్ బీవై రామయ్య స్పందిస్తూ మున్సిపల్ డీఈ రాజశేఖర్‌కు ఫోన్‌చేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాదె పోగు అయ్యన్న, ఉపాధ్యక్షుడు చంద్ర, సభ్యులు రాజా, అజయ్‌బాబు, సుధాకరయ్య పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

సి.బెళగల్, జనవరి 24: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీవో లక్ష్మన్న అన్నారు. జాబ్‌కార్డుల లేనివారు ఉంటే దాని కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఉపాధి పనులకు వచ్చిన కూలీలందరికీ తమ వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. ఈసీ పృధ్వీరాజు, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సి.బెళగల్, జనవరి 24: ఓటరు దినోత్సవాన్ని విజయ వంతం చేయాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం సమావేశ భవనంలో వీఆర్వోలతో అయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల ఓటరు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులను అంద జేయాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ మూర్తి, సర్వేయర్ నాగ భూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం







కర్నూలు: మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరెడ్డి, బాలికను సన్మానిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, అమడగుంట్లలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 24: స్థానిక ఎస్‌ఏపీ క్యాంపు కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటరెడ్డి మాట్లాడుతూ బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. వక్తృత్వ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు సుగుణమ్మ, సరోజ, రూతమ్మ, అనిత, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు: లింగనిర్ధారణ, భ్రూణ హత్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరం అని ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక కేవీఆర్ జూనియర్ కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు సాధికారిత పొందినప్పుడే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం దిశ చట్టం గురించి బాలికలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య శాఖ ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ హేమలత, ఎంఈవో వసంతలక్ష్మి లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి నరసప్ప, ఐసీడీఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు రాధ, కమాల్ ఖలీల్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కోడుమూరులో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు(రూరల్): మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, హెచ్‌ఎం అనంతయ్య యాదవ్ మాట్లాడుతూ ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అని అన్నారు. ఆడపిల్లల హక్కులు, ఆరోగ్యం, చదువు, బాల్య వివాహాల నిషేధం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు రామేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో బాలికల పట్ల ఉన్న వివక్షను దూరం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలోని కీర్తన అనాథ ఆశ్రమానికి ఆయన నెలసరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆయన కీర్తన అనే బాలికను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీర్తన అనాథాశ్రమం నిర్వహకులు విజయకుమార్ పాల్గొన్నారు.

టీజీ భరత్ ఆధ్వర్యంలో జాబ్ మేళా



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 24: నగరంలోని మౌర్య ఇన్‌లో టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ ఆధ్వర్యంలో బుధవారం 18 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు యువతీ, యువకులు హాజరై రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలులో నిరుద్యోగులు పెరిగిపోతున్నారని, తమ కంపెనీ ద్వారా ఇప్పటికే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. నిరుద్యోగుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేస్తే ఇందులో పాల్గొనకుండా పలు కంపెనీలను కొందరు అడ్డుకున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో హెచ్‌డీఆర్ యూత్ శివ, జనార్ధన్, కంపెనీల ప్రతి నిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 5 వార్డులో బాబు షూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడక్‌పురా, చిత్తారి వీధి, ఈద్గా, సుబ్రహ్మణ్యమఠం ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ సూపర్ 6 పథకాలను వివరించారు. వార్డుల్లో కాలువలు శుభ్రం చేయడం లేదని, విపరీతమైన దోమలు వస్తున్నాయని ప్రజలు ఆయనకు మొరపెట్టుకున్నారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్ర మంలో వార్డు ఇన్‌చార్జి బాలు, సురేష్, ఇంద్రజ, సుశీలమ్మ, రాజ్యలక్ష్మి, విజయ లక్ష్మి, లలితమ్మ, నరేష్, అనిల్, కార్తీక్, హిదాయత్, వసుంధర, మారుతి శర్మ, అంజి, సికిందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కంచర్లకు అభినందన



కంచర్ల శ్రీకాంత్‌ను అభినందిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 24: జోన్-5 ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పి. హనుమంతరాయ చౌదరీ ఆధ్వర్యంలో అభినందించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆధ్వర్యంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్‌తో కలిసి శాలువ కప్పి సన్మానించారు. రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏళ్లప్ప, జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, షేక్షావలి, రాష్ట్ర పరిశీలకులు మనోహర్ నాయుడు, ఈశ్వరయ్య చౌదరి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: నెల్లూరు జిల్లాలో ఈనెల 28న జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో మహాసభకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులందరికీ నేరుగా వేతనాలు చెల్లించాలని, మీటర్ రీడర్స్ రేట్ విధానం రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

39వ రోజు క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె: తమ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ ఎదుట క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె బుధవారానికి 39వ రోజుకు చేరింది. ఈకార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల హాజరై మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దే శాయ్, డి.కుమార్, ఆటో డ్రైవర్లు రఘుశేఖర్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

శరీన్‌నగర్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మృతి



హేమలత(ఫైల్)

కల్లూరు, జనవరి 24: శరీన్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.హేమలత(51) అనారోగ్యంతో మృతి చెంది నట్లు కల్లూరు ఎం ఈఓ శ్రీనివాసులు తెలిపారు. కొంతకాలంగా హేమ లత అనారోగ్యంగా ఉన్నారని మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిం దని తెలిపారు. కుటుంబ సభ్యులకు ఎంఈఓ సానుభూతి తెలిపారు.

సీఎం ఇల్లు ముట్టడికి పిలుపు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 24: వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తామని వాల్మీకి యువ సేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్ హెచ్చరించారు. వాల్మీకి సర్కిల్ వద్ద వాల్మీకులు ఐదో రోజు దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయి, భాస్కర్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణమే మోదీ పరిపాలనకు నిదర్శనం

కర్నూలు(కల్చరల్), జనవరి 24: అయోధ్యలో రామాలయ నిర్మాణమే భారత ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగురూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలోని 49వ వార్డులోని పుష్కర ఘాట్ సమీపంలో, చిన్నపార్కు వద్ద గల మదర్ థెరీసా విగ్రహం సమీపంలో బీజేపీ జెండాలను ఆయన బీజేపీ స్థానిక నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగురూరు రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక వైవిధ్యాన్ని, లౌకికతత్వాన్ని ఆరాధిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి, కార్యదర్శి రిత, అనితాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలి

కర్నూలు(అర్బన్), జనవరి 24: నగరంలోని 17 వార్డు ఎల్బీజీ నగర్‌లో మురుగు కాలువలు నిర్మించాలని రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సోమసుందర్ మాదిగ, నాగన్న మాదిగ, విజయ్, ఎద్దుల త్యాగరాజులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భం గా అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం కాలువల నిర్మాణం కోసం రూ. 37లక్షలు మంజూరు చేసినప్పటికీ ఎందుకు నిర్మించడంలేదో చెప్పాలని ప్రశ్నించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

కర్నూలు, జనవరి 24: నగరంలోని బంగారుపేటలో పోలీసులు బుధవారం కార్డన్‌సెర్చ్‌లో భాగంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. 130 లీటర్ల సారా, 500 కేజీల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజలు డయల్ 100కు గానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ విజయశేఖర్ సూచిం చారు. టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు ఖాన్, ప్రేమ, పోలీసులు పాల్గొన్నారు.

'విరసం' రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(కల్చరల్), జనవరి 24: విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర మహాసభలు ఈనెల 27, 28 తేదీలలో విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు విరసం రాష్ట్ర నాయకులు పాణి, నాగేశ్వరాచారి తెలిపారు. బుధవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విరసం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, రాయలసీమ ప్రచురణలు సంపాదకులు ఇనాయతుల్లా, పౌరోహితం మారుతి, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, కథాసమయం సంస్థ రచయితలు జి.వెంకటకృష్ణ, డాక్టర్ ఎం.హరికిషన్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విరసం రాష్ట్ర నాయకులు

టికెట్ ఎస్వీ కుటుంబానికే ఇవ్వాలి

వైసీపీ శ్రేణుల సమావేశం



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: కర్నూలు అసెంబ్లీ స్థానం ఎస్వీ మోహన్‌రెడ్డి కుటుంబానికే కేటాయించాలని ఎస్వీ వర్గీయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని గుత్తిపెట్రోలు బంకు సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 33 వార్డులకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు, ఇద్దరు కార్పొరేటర్లు, ఎస్వీ వర్గీయులు సమావేశమయ్యారు. ఈసారి ఎస్వీకుటుంబానికే టికెట్ ఇవ్వాలంటూ పార్టీ అధిష్టానానికి వారు అల్టిమేటం జారీ చేశారు. ఐదు సంవత్సరాలు తమ వర్గంపై ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టినా ఓపిగ్గా సహించామని కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఏ.షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్, 43వ కార్పొరేటర్ మునెమ్మ, 6వ వార్డు ఇన్‌చార్జి మల్లికాబాను, కిషన్ రాఘవేంద్రనాయుడు, భారతి, గద్దరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఓర్వకల్లు, జనవరి 24: ఉపాధి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, మంచినూనె, గోధుమపిండి, చక్కెర ఉచితంగా ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవో శివనాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, నాగమల్లేష్, మల్లేష్, శేష య్య, నాగరాజు, మాసూంబాషా పాల్గొన్నారు.

రైతులే దేశానికి వెన్నెముక

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: రైతులే దేశానికి వెన్నెముక అని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో రైతన్న డైరీని రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ దేశంలో 140 కోట్ల మందికి ఆహారాన్ని అందించే రైతులు సుభిక్షంగా ఉండాలని అన్నారు. రైతులు ఎంతో కష్టించి వ్యవసాయం చేసిన చివరికి అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి పట్టిందన్నారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలోని 460 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితి వచ్చిందని, రైతులను ఆదుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పంపన్న గౌడు, సీపీఐ నగర కార్య దర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు సి.మహేష్, డి.శ్రీనివాసరావు, నాయకులు సురేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

ఇచ్చేది గోరంత...దోచేది కొండంత: ఆకెపోగు

కర్నూలు(రూరల్), జనవరి 24: రాష్ట్రంలో జగన్‌రెడ్డి ఆసరా పేరుపై ప్రజలకు గోరంత ఇచ్చి...వారికి తెలియకుండానే కొండంత దోచేస్తున్నారని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ విమర్శించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలపై అరాచకాలు మితిమీరిపోయాయన్నారు. కోడికత్తి కేసులో శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని, అదే తన సామాజిక వర్గమైతే ఇన్ని రోజుల జైలులో ఉంచగలరా, కనీసం పోలీస్‌స్టేషన్‌లోనైన కేసు నమోదు చేయించగలరా.. అని ప్రభాకర్ ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం కావడం తథ్యమని అన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 24: షాద్‌నగర్‌లో ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి రూలర్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు హిమబిందు, హస్విక, రిషిక, దీపక్, శ్రావణ్‌లు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు. అనంతరం క్రీడాకా రులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బసవరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, శ్యాంకుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీఎస్‌డీవో శ్రీనివాసరావు

కబడ్డీ పోటీల్లో రాణించిన సల్కాపురం బాలికల జట్టు



బాలికల కబడ్డీ జట్టును అభినందిస్తున్న ఎంపీడీఓ, సర్పంచు

కల్లూరు, జనవరి 24: పాణ్యం నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్రా పోటీల్లో కల్లూరు మండలం సల్కాపురం బాలికల జట్టు రన్నర్‌గా నిలిచిందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. బుధవారం ఓర్వకల్లు మండలంలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో సల్కాపురం గ్రామానికి చెందిన బాలికల జట్టు ప్రతిభ చూపి రెండో బహుమతి కైవశం చేసుందకుందని అన్నారు. అలాగే బాలుర కబడ్డీ పోటీల్లో కె.మార్కాపురం జట్టు మూడో స్థానంలో నిలిచారన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన సల్కాపురం, కె.మార్కాపురం జట్లను ఎంపీడీఓ జీవీ.రమణమూర్తి, సల్కాపురం సర్పంచు బి.మద్దిలేటి సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, శ్రీనివాసులు, పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి పాల్గొన్నారు.

ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(న్యూసిటీ), జనవరి 24: రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాల సమన్వయం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మికులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకువచ్చి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నా యన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ఎంఎస్ స్వామినాథం సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు.

బీసీల పితామహుడు ఠాగూర్



ఠాగూర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బత్తుల లక్ష్మీకాంతయ్య

కర్నూలు(అర్బన్), జనవరి 24: బీసీల పితామహుడు కర్పూరి ఠాగూర్ అని బీసీ రిజర్వేషన్ల రాష్ట్ర పోరాట సమితి అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బుధవారం నగరంలోని బీసీ భవన్ వద్ద కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్య మంత్రి కర్పూరి ఠాగూర్ ఎంబీసీలోని నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయకు భారత రత్న ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ధన విజయుడు, పోలీస్ వెంకటస్వామి, మద్దిలేటీ, రాఘవేంద్ర, బీసీ నాయకులు శంకర్, చంద్రికమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 24: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీకి చెందిన 14 మంది విద్యార్థులు ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి మంగళవారం టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో సోమిశెట్టి వెంకట్రామయ్య, ప్రొ.డా. నాగఫణిశాస్త్రి, ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, లెక్చరర్లు రామకృష్ణ, విజయ శేఖర్, సోమేష్, విద్యార్థులు, పాల్గొన్నారు.

శాకంబరిగా మంచాలమ్మ


మంచాలమ్మకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 24: మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో వెలసిన గ్రామ దేవత మంచాలమ్మకు శాకాంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం చతుర్దశి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. అంతకుముందు ఉదయం నుంచి అమ్మవారికి వివిధ కూరగాయలు, తులసి, ఆకుకూరలతో శాకంబరి దేవిగా అలంకరణ దృశ్యం భక్తులను ఆకట్టుకుంది.

ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి కృషి

ఆదోని టౌన్, జనవరి 24: ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి కృషి చేస్తామని పారిశ్రామికవేత్త విట్టా రమేష్ అన్నారు. బుధవారం ఆర్యవైశ్య మహా సభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆదోనికి చెందిన పారిశ్రామికవేత్త విట్టా రమేష్, మిరియాల రాంప్రసాద్, టీజీ రాంప్రసాద్ అసోసియేట్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న మహాసభ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌కు విట్టా రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

జాబితాలో తప్పులు ఉంటే తెలియజేయండి

మద్దికెర, జనవరి 24: మండలంలో ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తేవాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ఓటరు జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. జాబితాలో ఎవరైనా మరణించిన వారి పేర్లు ఉంటే కుటుంబ సభ్యులతో మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని ఆ ఓట్లను తొలగించాలని తెలిపారు ఓటరు జాబితాలో అవకతవకలు జరిగితే సంబంధిత బీఎల్‌వోలదే బాధ్యత అన్నారు.

మహిళల కోసం సంక్షేమ పథకాలు

మద్దికెర, జనవరి 24: మహిళల కోసమే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక డీపీఏపీ కమ్యూనిటీ హాల్‌లో నాల్గవ విడత కింద పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా నిధుల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక పొదుపు మహిళలకు ఆసరా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనితయాదవ్, సర్పంచ్ సుహాసిని, ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ సర్వసభ్య సమావేశం నిర్వహించాలి

ఆదోని టౌన్, జనవరి 24: స్థానిక వీరశైవ విద్యా వర్ధక పాలక మండలి సర్వసభ్య సమావేశం గత 17 సంవత్సరాలుగా నిర్వహించకపోవడం ఎంతో విచారకరమని సంఘం సభ్యులు కన్నె జగదీష్, ఆనంద్, వీరభద్ర అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడంతో అనేక విషయాలు వెలుగులోకి రాకుండా ఉన్నాయని ఆరోపించారు. పట్టణంలోని వీరశైవ కన్నడ పాఠశాలతోపాటు మిఠాయి చిన్న బసప్ప పాఠశాల భవనాలు శిథిలావస్థలో చేరుకున్నా యన్నారు. చిన్నతుంబళం గ్రామంలో తమ సంఘానికి 12 ఎకరాల భూమి ఉందని, దీనికి సంబంధించిన ఆదాయ, ఖర్చులు బహిరంగపరచాలని కోరారు. సమావేశంలో సోమశేఖర్, శివన్న పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 24: పట్టణంలోని విమల రెసిడెన్సీ ఫైవ్ స్టార్ హోటల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ హోటల్ మేనేజ్మెంట్ చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 10 నుంచి రూ.40 వేల వరకు వేతనం అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు 9985496857, 9177413642 సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ విద్యార్థులకు స్కాలర్ షిప్పులు

ఆదోని టౌన్, జనవరి 24: స్థానిక గౌర సుబ్బరాయ శెట్టి సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వారు సంయుక్తంగా ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఉత్తమ విద్యార్థులకు బుధవారం సాయంత్రం స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు. మేనేజింగ్ ట్రస్టీలు గౌర లక్ష్మీనారాయణ, రాజగోపాల్, అశోక్‌లు మాట్లాడుతూ 2023-24 సంవత్స రానికి గాను ఎంపికైన ఉత్తమ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్పులు అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్లు రామచంద్రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు గిరిమల్లేష్ గౌడ్

ఆలూరు, జనవరి 24: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఆలూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ తనయుడు గిరి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే ధ్యే యంగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఖాదర్‌బాషా

వెల్దుర్తి, జనవరి 24: అఖిల భారత కాంగ్రెసు పార్టీ మండల అధ్యక్షుడిగా ఎస్ ఖాదర్ బాషా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారంఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే బాబురావు అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెల్దుర్తి మండల అధ్యక్షునిగా ఖాదర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యతోనే దేశ భవిష్యత్తు

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 24: విద్యతోనే దేశ భవిష్యత్తు అని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో అంతర్జాతీయ విద్యాది నోత్సవాన్ని జరుపుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్, రంగ నాథం, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

సూదేపల్లెలో నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వెల్దుర్తి, జనవరి 24 : మండలంలో సూదేపల్లె గ్రామంలో గురువారం డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి ఆవిష్కరించనున్నట్లు గ్రామస్తులు వినోద్, నాగేశ్వరరావు, చందులు బుధవారం తెలిపారు. దాతల సహకారంతో రూ.3లక్షలు వెచ్చించి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు: తిక్కారెడ్డి


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కౌతాళం, జనవరి 24: రాజకీయంగా, ఆర్థికంగా బీసీ వర్గాలకు గుర్తింపు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. మండలంలోని ఉరుకుందలో బుధవారం మంత్రాలయం తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు మాధవరం అమరనాథరెడ్డి ఆధ్యక్షతన నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిక్కారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ, ముస్లీం మైనార్టీలకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారన్నారు. నేడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బీసీలను అణగదొక్కుతూ వారు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగకుండా చూస్తున్నదన్నారు. రాష్ట్రంలో 52కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌లను నియమించగా వారికి నేటికీ కూర్చోడానికి కుర్చీ లేదని అన్నారు. ఒక్క కార్పొరేషన్‌కు కూడ పైసా నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికీ బీసీలకు సరైన సముచిత స్థానం లేదన్నారు. నియోజకవర్గంలో వనరులు పుష్కలంగా ఉన్నా వాటిని వినియోగంలో అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విఫలమయ్యారన్నారు. పనుల్లేక కూలీలు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు విభాగం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, నాయకులు కోట్రేష్‌గౌడ్, టిప్పుసుల్తాన్, రమేష్‌గౌడ్, బాపురం వెంకటరెడ్డి, బీసీ నాయకులు కురుగోడు, నీలకంఠరెడ్డి, రాజానందు, రాజబాబు, కార్యకర్తలు కావలి ఈరప్ప, ఎరిగేరి బసవరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయండి: తిక్కారెడ్డి

కోసిగి: పత్తికొండలో ఈ నెల 28న లక్ష మందితో జరిగే రా.. కదిలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతున్నారని, మంత్రాలయం నియోజకవర్గం నుంచి కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల నుంచి 20 వేల మంది రా.. కదిలిరా సభకు బయలుదేరుతున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి మంత్రాలయం తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం కోసిగిలోని బీరప్పస్వామి ఆలయ కళ్యాణమండపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు బటన్ నొక్కడం తప్ప.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, టీడీపీ నాయకులు వక్రాణి వెంకటేశ్, నాడిగేని అయ్యన్న, భరద్వాజశెట్టి, రంగన్న, ఉమర్‌సాబ్, కోసిగయ్య, రవితేజశెట్టి, మహాదేవ, మారెప్ప, ఎంపీటీసీలు హనుమంతు, రాజు, ఈరయ్య పాల్గొన్నారు.

● పత్తికొండలో ఈనెల 28న జరిగే 'రా.. కదిలిరా' చంద్రబాబు సభను టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు ఉలిగయ్య, రాఘవేంద్రరెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్ నాయుడు, రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కోసిగిలోని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వైసీపీని తరిమికొడదాం: కేఈ శ్యాంబాబు


మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

మద్దికెర, జనవరి 24: వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు తీరని ద్రోహం చేసిందని, బీసీలంతా ఏకమై వైసీపీ నయవంచక పాలనకు చరమగీతం పాడాలని, 2024 ఎన్నికలలో వైసీపీని తరిమికొట్టాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, జిల్లా బీసీ నాయకులు, పరిశీలకులు నంది మధు, కురువ నాగరాజు అన్నారు. బుధవారం మద్దికెరలో జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించి మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన జయహో బీసీ సభలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజకీయ రిజర్వేషన్ 34 నుంచి 24 శాతానికి తగ్గించడంతో బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. బీసీ నేతలు కార్యకర్తలతో పాటు సాధారణ జనంపై దౌర్జన్యాలు పెరిగాయని, అక్రమ కేసులను బనాయించి జైలు పాలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో బీసీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు. మాజీ జెడ్పీటీసీ రాజన్నయాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, నాయకులు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌గౌడ్, పెరవలి రామాంజులు, మనంతపురం శ్రీనివాసులు, మద్దికెర రామాంజినేయులు, జానకిచౌదరి, ఉదయ్ కుమార్, రాముయాదవ్, సర్పంచ్ అంజనేయులు, అశోక్‌కుమార్, పెద్దవీరన్న, సుధాకర్‌చౌదరి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి: బీవీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, జనవరి 24: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గోనెగండ్లలోని అచ్చుకట్లవీధి, ఎస్సీ కాలనీ, సంతమార్కెట్, దరగలవీధి తదితర ప్రాంతాలలో బీవీ పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు, నిరుద్యోగులకు, యువతకు మహిళలకు చేసే అభివృద్ధి పనుల గురించి వివరించారు. బీవీ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో గ్రామాలలో అభివృద్ధి శూన్యమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికార పార్టీ నాయకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గాను టీడీపీ హయాంలో ఎంపీఎస్ స్కీం ప్రకటించి రూ.13.50 కోట్ల నిధులకు కూడా విడుదల చేశామని, అయితే ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. జగన్ ప్రభుత్వం నిలిచిన పనులు ఇప్పటికైన చేపట్టి మండలంలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, మాజీ సర్పంచ్ రంగముని, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రంగస్వామినాయుడు, రాంపురం రఫీక్, రమేష్‌నాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మంత్రాలయానికి గుర్తింపు తీసుకురండి'

మంత్రాలయం, జనవరి 24: క్రీడల్లో క్రీడాస్ఫూర్తిని చాటుతూ విశేష ప్రతిభ కనబరిచి మంత్రాలయానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎంపీడీవో మణిమంజరి అన్నారు. బుధవారం మంత్రాలయం ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభించారు. కబడ్డీతో పాటు వివిధ క్రీడల్లో కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు, కౌతాళం మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని గౌరవ వందనాన్ని స్వీకరించి కబడ్డీ క్రీడలను తిలకించారు. అనంతరం సీసీ రోడ్డు పనులను పరిశీలించి తాగునీటి బోరును ప్రారంభించారు. గురెడ్డి భీమిరెడ్డి, దశరథరెడ్డి, శీనన్న, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, స్పెషల్ అధికారి శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, కార్యదర్శి నాగరాజు, సీఐ ఎరిషావలి, ఎస్ఐ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తేరు బజారును పరిశీలించిన డీఎస్పీ


తేరుబజారు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరుటౌన్, జనవరి24: ఈనెల 27న నీలకంటేశ్వరస్వామి రథోత్సవం జరగనున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య తేరుబజారు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు మాచాని శివశంకర్‌తో జాతర ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. డీఎస్పీ వెంట సీఐ, ఎస్ఐలు మధుసూధన రావు, మస్తాన్ వలిలు ఉన్నారు.

అసైన్డ్ భూమిని స్వాహా చేసిన ఎమ్మెల్యే సాయి

టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం ధ్వజం



మాట్లాడుతున్న ఉమ్మి సలీం

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 24 : ఆదోని పట్టణంలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి అధికార దుర్వినియోగంతో ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను స్వాహా చేశాడని టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు ఉమ్మి సలీం ఆరోపించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీలకు ఆనాటి ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ ద్వారా భూములను పంపిణీ చేసిందని అన్నారు. మండిగిరి పంచాయతీ పరిధిలోని అసైన్డ్ భూముల రికార్డులను మార్చేసి, పట్టా భూములుగా మార్చి కొనుగోలు చేశా రన్నారు. 2010లో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సీలింగ్ యాక్ట్ నిబంధనలు తుంగలో తొక్కి తమ కుమారుడు, కూతురు పేరు మీద 36 ఎకరాలు ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసి డాక్యుమెంట్లు సృష్టించారన్నారు. పేదలకు చెందిన భూములను వారి పొట్ట కొట్టి లాక్కోవడం అన్యాయమని అన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

మంత్రాలయం, జనవరి 24: రాబోయే ఎన్నికల దృష్ట్యా, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాధవరం చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ కిరణ్‌బాబు సూచించారు. బుధవారం రాత్రి మాధవరం చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాను పరిశీలించారు. అదనంగా సిబ్బందిని పెంచి కర్ణాటక నుంచి ఆంధ్రకు వచ్చే వాహనాలతో పాటు డబ్బు, మద్యం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు.

వాల్మీకుల దీక్షకు టీడీపీ మద్దతు

ఆలూరు, జనవరి 24: వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ ఆలూరు బస్టాండ్‌లో దీక్షలు నిర్వహిస్తున్న ఆ సంఘం నాయకులకు టీడీపీ నాయకులు రఘుప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్, నారాయణ, మద్దతు ప్రకటిం చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చంద్రబాబు వాల్మీకులను ఎస్టీ జాబి తాలోకి చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం పార్లమెంట్‌కు పంపారన్నారు. టీడీపీ అధికారంలోకి వేస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తారన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం

మద్దికెర, జనవరి 24: ఆడపిల్లలు ఇంటికి వెలుగులాంటి వారని, వారిని పురిటిలోనే చంపకుండా బతకనిద్దామని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సవిత, వార్డెన్ ఉషారాణి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వసతి గృహంలో నివాసం ఉండే బాలికలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యూకేటర్ అక్బర్‌బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే విజయం సాధ్యం

దేవనకొండ, జనవరి 24: అంగన్‌వాడీ వర్కర్లు 42 రోజులపాటు చేపట్టిన పోరాటాల వల్లే విజయం సాధ్యమైందని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు వీరశేఖర్, మద్దిలేటిశెట్టి అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్యసలను నేరవేరుస్తామని అంగీకరించడంతో బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు.

మద్యంపై విస్తృతంగా దాడులు

ఆస్పరి, జనవరి 24: మండలంలోని వివిధ గ్రామాలలో అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామని సీఐ హనుమంతప్ప బుధవారం తెలిపారు. మండలంలోని కైరుప్పల గ్రామంలో నాటు సారా స్థావరాలపై దాడులు చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాంజనేయ అనే వ్యక్తి ఇంట్లో 30 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, ఆయనను ఆరెస్టు చేశామని అన్నారు. అదేవిధంగా 800 లీటర్ల నాటుసార ఊటను ధ్వంసం చేశామన్నారు. దేవనకొండ సీఐ శ్రీనివాసులు, ఆలూరు ఎస్సై ఓబులేశు, ఆస్పరి పోలీసులు పాల్గొన్నారు.

భయంతోనే భారత్ జోడో యాత్రపై దాడులు

ఆదోని టౌన్, జనవరి 24: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రపై అస్సాం ప్రభుత్వం తీవ్ర ఆటంకాలను కలిగిస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠప్ప ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అస్సాం రాష్ట్రంలో జోడో యాత్రను అడ్డుకోవడం కోసం బారికేడ్లను ఏర్పాటు చేసి ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పట్టణ కాంగ్రెస్ నాయకులు సాయినాథ్, దేవిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

సెబ్ సీఐగా ఎస్ఎం బాషా బాధ్యతల స్వీకరణ

కోసిగి, జనవరి 24: కోసిగి సెబ్ సీఐగా ఎస్.మహబూబ్ బాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరులో పని చేస్తూ సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా కోసిగికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. గతంలో కోసిగి సెబ్ సీఐగా పని చేస్తున్న సృజన్‌బాబు చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతానికి బదిలీ అయ్యారు.

ఓటింగ్‌పై అవగాహన: ఆర్డీఓ

మద్దికెర, జనవరి 24: రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం కల్పించిందని, అందువల్ల ఈవీఎంల ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన ఉండాలని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని బురుజుల గ్రామంలో ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో మొత్తం 29వేల ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. తహసీల్దార్ నాగభూషణం, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో శివన్న, సింగిల్‌విండో చైర్మన్ సుబ్బయ్య ఉన్నారు.

'మాదిగలకు న్యాయం చేయాలి'

మంత్రాలయం, జనవరి 24: వచ్చే ఎన్నికల్లో ఎస్సీ రిజర్వు స్థానాల్లో మాదిగలకు ఆయా రాజకీయ పార్టీలు సముచిత న్యాయం కల్పించాలని, లేకపోతే ఊరుకునేది లేదని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆయన విలేకరలుతో మాట్లాడారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో 29 ఎస్సీలకు, నాలుగు ఎంపీ సీట్లు రిజర్వుగా ఉన్నాయని, ఇందులో ఇతర ఎస్సీ కులానికి ఒకటి కేటాయించగా.. మిగిలిన 28లో 14 సీట్లు, 14 సీట్లు మాలలకు సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యేబు, పేతురు పాల్గొన్నారు.

అర్హుల వివరాలు ఇవ్వాలి: ఎంఈఓ

కౌతాళం, జనవరి 24: మండలంలో 1998-2001 మధ్య అనియత విద్యా కేంద్రాలలో ట్యూటర్లుగా విధులు నిర్వర్తించిన వారు తమ వివరాలను ఈ నెల 26లోపు మండల విద్యాధికారి కార్యాలయంలో సమర్పించాలని ఎంఈఓలు వరప్రసాద్, శోభారాణిలు తెలిపారు. బుధవారం వారు ఎంఆర్సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 1998-2001 మధ్య అనియత విద్యా కేంద్రాలలో విద్యా వలంటీర్లుగా విధులు నిర్వర్తించిన వివరాలను తెలుపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కోసిగి, జనవరి 24: కోసిగికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పెండ్యాల రమేష్‌శెట్టి గత కొన్ని రోజుల క్రితం గుండెకు సంబంధిత వ్యాధితో చికిత్స పొంది ఇంటికి రావడంతో టీడీపీ నాయకులు ఉలిగయ్య, రాఘవేంద్రరెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్‌నాయుడు, రామకృష్ణారెడ్డి పరామర్శించారు.

భక్త కనకదాస విగ్రహ ఏర్పాటుకు విరాళం

పెద్దకడుబూరు, జనవరి 24: మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో కురుబ సోదరులు ఏర్పాటు చేస్తున్న భక్త కనకదాసు విగ్రహానికి టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి రూ.50 వేలు ఇచ్చారు. ఈ విరాళాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ యువ నాయకులు దివాకర్ రెడ్డి చేతులు మీదుగా ఎమ్మిగనూరులోని ఆయన స్వగ్రహంలో బుధవారం గ్రామ పెద్దలకు అందజేశారు. నాయకులు వీరేష్ గౌడ్, శివ, నరసింహులు, చంద్ర, బద్రి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

'ఓటు తొలగించిన బీఎల్‌వోపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు, జనవరి24: మండలంలోని బనవాసి ఫారంలో పోలింగ్ బూత్ 174 ఓటరు జాబితాలో దురుద్దేశంతో తన ఓటును తొలగించిన బీఎల్‌ఓ విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు వీరనాగప్ప కోరారు. బుధవారం తహసీల్దార్ ఆంజనేయులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పోప్పులు సరిచేయకుండా బీఎల్‌ఓ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

'జయహో బీసీ సదస్సును జయప్రదం చేయండి'

తుగ్గలి, జనవరి 24: టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించే జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు తిరుపాలు నాయుడు, బాలన్న, లక్ష్మణస్వామి, రవియాదవ్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

నేడు శాంభవీదేవి రథోత్సవం



ముస్తాబైన రథం

కోసిగి, జనవరి 24: ఆర్లబండ గ్రామంలో వెంకావధూత అంబాదేవి శాంభవీదేవి రథోత్సవం గురువారం జరగనుంది. మఠంపై గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు రథోత్సవ వేడుకలకు పది రోజుల ముందు నుంచి మఠం మఠ్రిస్వామి తాతతో వైరుధ్యం పెట్టుకున్న విషయం విధితమే. దీంతో మఠం పీఠాధిపతి రథోత్సవానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే.. కొందరు నాయకులు గ్రామ పెద్దలు, కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ సూచనల మేరకు మఠం పీఠాధిపతి మఠ్రిస్వామి తాత రథోత్సవాన్ని గతంలో మాదిరిగానే నిర్వహించాలని ఒప్పుకోకున్నారు. దీంతో మంగళవారం వరకు ముస్తాబు కానీ రథోత్సవానికి ఒక్కరోజు ముందుగా ఏర్పాట్లు సిద్ధం చేశారు. అయితే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని భక్తులు పోలీసులను విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

తుగ్గలి, జనవరి 24: మండలంలోని రాతన గ్రామంలో సుంకులమ్మవ్వ దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి భక్తులు ఇంటింటి నుంచి నైవేద్యం, బోనాలు తీసుకెళ్లి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ దేవర ఉత్సవాలలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే శ్రీదేవి, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. గ్రామంలోని ఆయా పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లారు. గ్రామపెద్దలు మనోహర్‌చౌదరి, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, వెంకటేష్‌చౌదరి, సర్పంచ్ రాచప్ప, నరసింహ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కులమార్పిడి చేస్తే ప్రత్యక్ష ఆందోళన


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న కురువ సంఘం నాయకులు

పత్తికొండటౌన్, జనవరి 24: పూర్వం రోజుల నుంచి కురువలుగా ఓటరు జాబితాలో కనిపిస్తున్నవారిని కులగణన సర్వేలో అధికారులు మార్చాలని చూస్తే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని మదాసి, మదారి కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగ, రాష్ట్ర నాయకుడు బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మదాసి కురువ, మదారి కురువ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వం నుంచి కురువల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు మాత్రం కురుబ, కురుమ అనే సర్టిఫికెట్లు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పత్తికొండ, తుగ్గలి, క్రిష్ణగిరి, మద్దికెర మండల అధ్యక్షుడు లాలప్ప, నరేష్, మల్లికార్జున, లచ్చప్ప, నియోజకవర్గ కార్యదర్శి కోటలిం గప్ప, నాయకులు పందికోన శీను, ప్రహ్లాద, ఎంపీటీసీ చంద్ర, హనుమేష్ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్, జనవరి 24: పట్టంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 14112 స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన వైఎస్ఆర్ ఆసరా చెక్కు రూ. 10,10,62,628 మున్సిపల్ చైర్మన్ డా. రఘు అందజేశారు. మున్సిపల్ వైఎస్ చైర్మన్ నజీర్, కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.